భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 31.0 - 26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 18 జూలై 2024







తొలి ఏకాదశి వైభవం

తొలి ఏకాదశి సందర్భంగా పాలకొల్లు శంబన్న అగ్రహారంలో వేంకటేశ్వరస్వామికి చందనంతో అలంకారం

భీమవరంలో.. మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు.. కన్యకా పరమేశ్వరికి శాకాంబరి అలంకారం



భక్తి శ్రద్ధలతో మొహరం

త్యాగ గుణాన్ని గౌరవించేందుకు.. వీరత్వం నుంచి స్ఫూర్తి పొందేందుకు ముస్లింలు బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా మొహరం పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఏలూరులో పీర్లను ఊరేగించి భక్తిని చాటుకున్నారు. రాత్రి పీర్లను కర్బలా మైదానంలో నిమజ్జనం చేశారు.



మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత

- నూతన ఎస్పీ నయీం అస్మి.. బాధ్యతల స్వీకరణ



భీమవరం క్రైం, జూలై 17 : జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు అధిక ప్రాముఖ్యత ఇస్తానని జిల్లా నూతన ఎస్పీగా అద్నాన్ నయీం అస్మి చెప్పారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మహిళలు, చిన్న పిల్లలపై జరిగే దాడులను అరికట్టి, వారిపై జరిగే నేరాల్లో ముద్దాయిలకు త్వరితగతిన ట్రయిల్ నిర్వహిం చి కోర్టులో శిక్ష పడే చర్యలు తీసుకుంటాం. కాలేజీలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లేకుండా గస్తీ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. జిల్లాలో గంజాయి లేకుండా చూస్తాం. వీటిని అమ్మే వారిని, రవాణా చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. నేర పరిశోధనను సమర్థవంతంగా చేస్తాం. గతంలో జరిగిన ఆస్తి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్తులను పట్టుకుంటాం. నేరాలు జరగకుండా రాత్రిపూట ఎక్కువ బీట్‌లు తిరిగే విధంగా చూస్తాం. రౌడీ షీటర్‌ల మీద నిరంతర నిఘా ఉంటుంది. జిల్లాలో సైబర్ క్రైమ్ కట్టడికి కృషి చేస్తాం. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తాం. ప్రతీ అంశంపైన రివ్యూ చేసి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని' అని జిల్లా ఎస్పీ కోరారు. ఏఎస్పీలు వి.భీమారావు, ఏటీవీ రవికుమార్, డీఎస్పీలు డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, వి.నారాయణస్వామిరెడ్డి, జి.శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, నున్న మురళీకృష్ణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ అప్డేషన్



భీమవరంటౌన్, జూలై 17 : జిల్లావ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ అప్డేషన్‌కు ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహిం చనున్నట్లు కలెక్టర్ చదవాడ నాగరాణి తెలి పారు. మండలంలో రోజుకు నాలుగుచోట్ల ఎంపిక చేసిన గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీల్లో వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆధార్ న్యూ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ డాక్యుమెంట్, ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేస్తామని, ఎప్పుడు, ఎక్కడ నిర్వహించేది మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రచారం చేయాలన్నారు. వీరవాసరం ఎస్సీ కాలనీలోని యానాది, ఎరుకల కుటుంబాలకు ఆధార్ ఎన్రోల్మెంట్ చేస్తామన్నారు.



ఇంకా నీటిలోనే

120 ఎకరాల్లో దెబ్బతిన్న నారుమడి

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 17 : ఎడతెరిపి లేని భారీ వర్షాలకు సార్వా నారుమడులు దెబ్బ తిన్నాయి. పది రోజుల నుంచి అధికంగా వర్షాలు పడటంతో ఇవి పదే పదే ముంపునకు గురయ్యాయి. దీంతో జిల్లాలో 120 ఎకరాలలో నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని వందల ఎకరాలలో నారుమడులు నీటిలోనే ఉన్నాయి. నీరు బయటకు వెళితే గాని ఎంత మేరకు నష్టం వాటిల్లిందో తెలియదు. ముంపు వల్ల దెబ్బతిన్న నారుమడులలో మొలక శాతం తగ్గుతుంది. అందువల్ల మరోసారి నారుమడులు వేయాల్సిందే. జిల్లాలో వెనకస్తు నారుమడులు రెండు వేల ఎకరాల వరకు ఉంటాయి. కొన్ని ప్రాంతాలలో సార్వా రెండోసారి నారుమడులు వేయాలి. నాట్లు ఆలస్యంగా సాగుతాయి. దెబ్బ తిన్న నారుమడులు 40 రోజులకు గాని నాట్లు వేసేందుకు పనికిరావు. ఇప్పుడు నారుమడులు వేస్తే 35 రోజులకు నాట్లు వేయాలి. ఈ లెక్కన ఆగస్టులోనే నాట్లు పడేలా కనిపిస్తున్నాయి. అధిక వర్షాల వల్ల సార్వా నాట్లు నెల ఆలస్యానికి దారితీయడంతో నారుమడి పెట్టుబడులకు అదనపు భారం పడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉధృతం కావడంతో జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనిపై ఉమ్మడి జిల్లాలోని అధికారులు అప్రమత్తమయ్యారు.

టిడ్కో లబ్ధిదారులకు
బ్యాంకులు ఝలక్



భీమవరంలో టిడ్కో గృహాలు

వాయిదాలు చెల్లించాలంటూ నోటీసులు.. ఆందోళనలో లబ్ధిదారులు

జిల్లాలో ఏపీ టిడ్కో లబ్ధిదారులకు రుణాలు ఇచ్చి బ్యాంకులు ఝలక్ ఇస్తున్నాయి. తీసుకున్న రుణాలకు వాయిదాలు చెల్లించాలంటూ నోటీసులు పంపడంతో వీరు ఆందోళన చెందుతున్నారు. కొందరికి ఫోన్‌లు చేసి వాయిదాలపై అడుగుతుండడంతో ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదని వాపోతున్నారు.

భీమవరం టౌన్, జూలై 17 : గత వైసీపీ ప్రభుత్వ హయంలో టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశారు. ఇలా మంజూరైన నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించుకుంది. ఈ నేపథ్యంలో రుణాలు మంజూరు లబ్ధిదారులకు మాత్రం పట్టాలు ఇచ్చారే తప్ప ఇళ్ళు అప్పగించలేదు. దీనికి కారణం అక్కడ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పూర్తి కాకపోవటంతో ఇళ్ళు అప్పగించలేదు. గతంలో ఇచ్చిన వారుకూడా మురుగునీరు పోక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇళ్ల అప్పగించేవారు బ్యాంకుల వాయిదాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని అప్పట్లో ప్రభుత్వం చెప్పిందని లబ్ధిదారులు వాపోతున్నారు. బ్యాంకుల్లో ఎన్‌పీఏలు పెరగడంతో ఉన్నతాధికారులు స్థానిక బ్యాంకు అధికారులను రుణాల వసుళ్ళ చెయ్యాలని ఆదేశించటంతో స్థానిక బ్యాంకు అధికారులు చర్యలు ఉపక్రమిస్తున్నారు. ఇంకా తాము ఇళ్లలోకి వెళ్లకుండానే వాయిదాలు ఎలా చెల్లిస్తామనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట అద్దెలు కట్టాలి. బ్యాంకు వాయిదాలు చెల్లించాల్సి రావటంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఏపీ టిడ్కో తొలి విడతలో ఇళ్ల నిర్మాణం చేసిన భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

జిల్లాలో రుణం ఇలా..

జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు పట్టణాల్లో దాదాపు 11 వేల 360 మంది లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. జాతీయ బ్యాంకులే కాస్త ఉదారంగా వ్యవహరించాయి. ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి విముఖత చూపాయి. జిల్లాలో మొత్తంపైన జాతీయ బ్యాంకులు టిడ్కో లబ్ధిదారులకు రూ.335.80 కోట్లు రుణం రూపంలో మంజూరు చేశారు. లబ్ధిదారులకు ఇళ్ళు అప్పగించేంత వరకు వాయిదాలు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం స్పష్టం చేసింది. అప్పటి వరకు వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని సీఎం హోదాలో నాడు జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం మాటను నిలుపలేకపోయారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో తొలి విడత నిర్మాణాలు చేపట్టారు. మూడు పట్టణాల్లో 19 వేల 872 ఇళ్ళు మంజూరయ్యాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 8 వేల 736 ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల తరువాత లబ్ధిదారులకు అప్పగించింది. అయితే మిగిలిన 11 వేల 136 ఇళ్ళకు సంబంధించి 80 శాతం పనులు గత టీడీపీ హయాంలోనే పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రంగులు మార్చేందుకే శ్రద్ధ చూపారు తప్ప, ఇళ్ళు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వాలన్నా ధ్యాస వైసీపీ ప్రభుత్వం కనిపించలేదు.

బంగారు రుణాలకు అడ్డంకి



రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా బ్యాంకులకు వడ్డీ చెల్లించలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మాట నెరవేర్చలేదు. పూర్తిస్థాయిలోను ఇళ్ళు అప్పగించలేదు. ఈ నేపథ్యంలోనే బ్యాంకులు వాయిదాల చెల్లింపులపై పట్టుబడుతున్నాయి. టిడ్కో ఇళ్ళ లబ్ధిదారుల సిబిల్ పాయింట్లు పడిపోతున్నాయి. ఇతర రుణాల కోసం వెళితే బ్యాంకులు మొండిచెయ్యి చూపుతున్నాయి. టిడ్కో వాయిదాలు చెల్లించటం లేదని స్పష్టం చేస్తున్నాయి. బంగారంపై రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పోటీ పడుతుంటే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామంటూ ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు కనిపిస్తాయి. బ్యాంకులకు వెళ్ళిన రోజునే సొమ్ములు అందే పరిస్థితి టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులకు మాత్రం బంగారు ఆభరణాలకు రుణాలు అందడం లేదు. టిడ్కో రుణాలను బూచిగా చూపిస్తున్నారు. వాయిదాలు చెల్లించిన తర్వాత రుణాలు ఇస్తామంటూ చెబుతున్నాయి. ఫలితంగా బ్యాంకుల్లో తమ పరపతి పడిపోతోందంటూ లబ్ధిదారులు చెబుతున్నారు.

మరో ఏడాది మారటోరియం పెరిగేనా



గత ప్రభుత్వం నాలుగేళ్లు టిడ్కో లబ్ధిదారులను పట్టించుకోలేదు. అయితే ఎన్నికలు దగ్గర పడడంతో ఒక్కసారిగా లబ్ధిదారులు గుర్తుకురావడంతో వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేయించి, పట్టా కాగితాలను అట్టహాసంగా ఇప్పించి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు ఆ పత్రాలే వారికి గుదిబండలుగా మారాయి. ఇళ్లు ఇవ్వకుండా వాయిదాలు కట్టే పరిస్థితి లేనందున ఒక ఏడాది మారటోరియం పెంచుతారనే ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే లబ్ధిదారులకు ఊరట కలిగినట్లే. మరి కూటమి ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.

టిడ్కో ఇళ్ల నిర్మాణంలో కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో మళ్లీ నిర్మాణాల్లో కదలిక ప్రారంభమైంది. మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లను నియమించారు. త్వరితగతిన ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు కసరత్తు చేపట్టారు. వచ్చే డిసెంబరు నాటికి ఇళ్లు అందించాలనే లక్ష్యంగా సాగాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు అందాయి. అదే విధంగా అన్ని టిడ్కో ఇళ్ళ నిర్మాణాల వద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్‌లను పూర్తి చేస్తే గానీ ఇళ్లు ఇవ్వడం కుదరని పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో త్వరలోనే పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఎంపీడీవో ఎక్కడున్నారు ?

ఇంకా లభించని ఆచూకీ
విజయవాడ, ఏలూరు జిల్లాల్లో గాలింపు
మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో బైక్, ఏలూరు కాల్వ వద్ద చెప్పుల గుర్తింపు
ఆయనకు ఏమైనా జరిగితే బాధ్యులపై కేసులు : నరసాపురం ఎమ్మెల్యే నాయకర్
ఎంపీడీవోకు అండగా ఉంటాం : పాతూరి



గల్ఫ్‌లో ఉపాధి ప్రాణాలకు హాని

కూటి కోసం కోటి తిప్పలు
ఏజెంట్ల మాయమాటలకు మోసపోయి..
ఇరుక్కుపోతున్న జిల్లావాసులు
దిక్కుతోచని స్థితిలో తిరిగి వచ్చేందుకు
వాట్సప్ వీడియోలతో వేడుకోళ్లు
నకిలీ ఏజెంట్ల మోసాలపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ నయీం అస్మి - 7లో



ఇంటి చుట్టూ అడ్డంగా క్లాత్‌తో కట్టిన కంచె

వెంటాడుతున్న వైసీపీ వేధింపులు

- అంగన్వాడీ టీచర్ కుటుంబానికి సాంఘిక బహిష్కరణ హెచ్చరిక

నూజివీడు టౌన్, జూలై 17: డిమాండ్ల సాధన కోసం వైసీపీ ప్రభుత్వంలో ఆందోళన బాట పట్టిన అంగన్వాడీల నాటి కష్టాలు నేటికీ వెంటాడుతున్నాయి. నాడు నయానో భయానో ఒత్తిడి తెచ్చి విధుల్లో చేర్పించారు. కాని, రాష్ట్రంలో ప్రభుత్వం మారినా గ్రామంలో అంగన్వాడీ టీచర్‌పై ఆ చాయలు మాత్రం పోలేదు. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారంటూ అంగన్వాడీ టీచర్ కుటుంబాన్ని సాంఘికంగా బహిష్కరించేలా ఇంటి చుట్టూ కంచె వేసి మీ కుటుంబానికి దారి లేదంటూ గ్రామస్తులు పేర్కొనడం దుమారం రేపుతోంది. ఎస్సీ పేటలో ఉంటున్న అంగన్వాడీ టీచర్ ఊస వసుంధర గత ప్రభుత్వంలో తమ డిమాండ్ల సాధనకు ఉద్యమంలో పాల్గొంది. పల్లె వాసులు వసుంధర కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తుండగా.. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారి టీడీపీ అధికారంలోకి వచ్చింది. మీరు టీడీపీకే అనుకూలంగా వ్యవహరించారంటూ టీచర్ కుటుంబానికి వైసీపీ నుంచి మరింత వేధింపులు పెరిగాయి. విషయం గ్రామ పెద్దల దృష్టికి వెళ్లినా వేధింపులు ఆగలేదు. దారి లేదంటూ ఈ నెల 9న తమ ఇంటికి ఇరువైపులా వైసీపీకి చెందిన స్థానికులు కుమార్, శ్రీనివాసరావు, దుర్గారావు కంచె వేశారని బాధితులు వాపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కంచెను తొలగించలేదని, పైగా వెలివేస్తామని హెచ్చరిస్తున్నారని ఆమె భర్త రాజు ఆరోపించారు.

కళాశాలల ఖాతాలకే ఫీజులు

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాటిని కళాశాలల ఖాతా ల్లోనే జమ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఆ దిశగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

- తొలగనున్న ఇంజనీరింగ్ విద్యార్థుల ఇబ్బందులు.. యాజమాన్యాలకు ఊరట





(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వాస్తవానికి గతంలో ప్రభుత్వాలు కళాశాలల ఖాతాల్లోనే జమ చేసేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లుల ఖాతాలోకి సొమ్ములు విడుదల చేస్తూ వచ్చారు. వారం వ్యవధిలో కళాశాలలకు చెల్లించాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం సకాలంలో ఫీజులు విడుదల చేయకపోతే సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా యాజమాన్యాలు ఇబ్బందులు పెట్టేవి. ఏటా ఇదే సమస్య ఉత్పన్నమయ్యేది. పరీక్షలు ముందు హాల్ టిక్కెట్‌లు ఇవ్వాలంటే ఫీజులు కట్టాలంటూ యాజమాన్యాలు ఒత్తిడి తెచ్చేవి. ఈ ఏడాది ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదు. వైసీపీ హయాంలో దాదాపు రూ.3,400 కోట్లు బకాయిలు చెల్లించాలి. దీంతో చివరి ఏడాది పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్‌లు ఇవ్వడానికి కళాశాలలు నిరాకరించాయి. దీంతో ఫీజు రీయింబర్‌మెంట్‌పై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసింది. కళాశాలల్లో ఖాతాల్లో జమ చేస్తే విద్యార్థులకు ఇబ్బంది ఉండదు. బకాయిలకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. వైసీపీ ప్రభుత్వం అటువంటి నమ్మకాన్ని కోల్పోయింది. గత ప్రభుత్వాలు బకాయి పడ్డ పీజీ కోర్సుల ఫీజులను చెల్లించలేదు. దాదాపు 70 శాతం చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో యాజమాన్యాలు సమ్మతించాయి. అయినా సరే బకాయిలు విడుదల చేయలేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాజమాన్యాలు కాస్త ఊపిరి పీల్చుకున్నాయి. అందుకు తగ్గట్టుగానే కళాశాలల ఖాతాలో ఫీజులు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విద్యార్థులకు ఇబ్బంది ఉండదు. ప్రభుత్వమే అంతా చూసుకుంటుంది. యాజమాన్యాలకు వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే కళాశాలల ఖాతాలో జమ కానున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా విద్యార్థులు చెల్లించేంత వరకు ఎదురు చూడాల్సిన అవసరం లేదు. విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన కళాశాలలు ఉన్నాయి.

ఫీజుల నిర్ధారణ

కళాశాలల ఫీజులను ప్రభుత్వం నిర్ధారించింది. ఫీజు నిర్ధారణ కమిటీ సిఫారసు కాకుండా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈసారి ఫీజులు ఖరారయ్యాయి. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశా లలకు మూడు స్థాయిల్లో నిర్ణయించారు. అత్యధికంగా రూ.1.05 లక్షలు ఫీజు ఉంది. భీమవరంలోని రెండు కళాశాలలకు ఆ ఫీజు వర్తించింది. ఆ తర్వాత రూ.67 వేలు ఫీజును నిర్ణయించారు. తాడేపల్లిగూడెంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల ఆ ఫీజును దక్కించుకుంది. భీమవరంలో ఇంకో కళాశాలకు రూ.60 వేలు ఫీజును నిర్ధారించారు. మిగిలిన కళాశాలలకు రూ.43 వేలు ఫీజును ఖరారు చేశారు. ఫీజుల విషయంలో కొన్ని కళాశాలలకు అన్యాయం జరిగిందన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ హయాంలో కొన్ని కళాశాలలకు ఉద్దేశ పూర్వకంగా ఫీజులను కుదించారు. ఇప్పటికీ అవే ఫీజులను అమలు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో చెల్లింపు

కళాశాలలకు నిర్ధారించిన ఫీజులను పూర్తిస్థాయిలో చెల్లిస్తుందని యాజమాన్యాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఆ దిశగా సంకేతాలు అందాయి. అదే జరిగితే విద్యార్థులకు ఇబ్బంది ఉండదు. గతంలో ప్రతి కళాశాలకు పూర్తి స్థాయిలోనూ ఫీజులు చెల్లించారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఫీజులను కుదించింది. అదే తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు రూ.40 వేలు చెల్లించేవారు. తొలి పది వేల ర్యాంకుల వరకు పూర్తిస్థాయి ఫీజును అమలు చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించారు. ఈ సారి అందరి విద్యార్థులకు పూర్తిగా ఫీజులు చెల్లిస్తారని భావిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ప్రభుత్వం చెల్లించే ఫీజును బట్టి విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకుంటారు. పూర్తిస్థాయిలో చెల్లిస్తే ఇబ్బంది ఉండదు. ఆ దిశగా త్వరితగతిన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. జిల్లాలో 70 వేల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించనుంది. ప్రతి మూడు నెలలకు రూ.25 కోట్లు చెల్లించాలి. పెరిగిన ఫీజులతో ప్రభుత్వానికి మరికాస్త భారం కానుంది.



నేత్రపర్వం..జగన్నాథుని రథోత్సవం

ద్వారకాతిరుమల, జూలై 17: ద్వారకా తిరుమల మండలం లక్ష్మీపురంలో జగన్నాథ స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం శోభాయమానంగా జరిగింది. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పూరి క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. పూజలు, బలిహరణల అనంతరం రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పువాయిద్యాలు, కోలాట భజనల నడుమ రథయాత్ర తిమ్మాపురం వరకూ నేత్రపర్వంగా జరిగింది. అతి పురాతనమైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా విరాజిల్లుతోంది. రథోత్సవాలు ఈనెల 7 నుంచి ప్రారంభమై బుధవారంతో ముగిశాయి.



వైభవంగా శ్రీవారికి ఏకాదశి ఉత్సవం

శ్రీవారి ఏకాదశి ఉత్సవం బుధవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తొళక్కవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం పూజాదికాలను జరిపి ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర తిరు వీధులకు తీసుకొచ్చారు.

కనక దుర్గమ్మకు రజిత కవచం



పాలకొల్లు అర్బన్, జూలై 17 : పాలకొల్లు యడ్లబజారులోని కనక దుర్గమ్మవారికి భక్తులు రజిత కవచం బహూకరించారు. సుమారు రూ.6 లక్షల విలువైన 5 కిలోల వెండితో తయారు చేయించిన ఈ కవచాన్ని బుధవారం పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి నెక్కంటి ఆదినారాయణ జ్ఞాపకార్థం భార్య సత్యవతి, కుమారుడు శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు కార్య నిర్వహణాధికారి సతీష్ కుమార్‌కు అందజేశారు. అర్చకులు మోగింటి వెంకటరమణ సంప్రోక్షణాది కార్యక్రమాలు జరిపించి అమ్మవారికి అలంకరించారు.



కేంద్ర మంత్రిని కలిసి సత్కరిస్తున్న అధికారులు

ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దును ఆహ్వానిస్తున్నాం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేశారని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టును కేంద్ర ప్రభుత్వానికి ఆపాదించాలని చూసిందని ఆరోపించారు. అదే విధంగా ప్రచారం కూడా చేశారని ప్రజలు వైసీపీ ప్రభుత్వం మోసాన్ని గుర్తించి గుణపాఠం చెప్పారన్నారు. అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేసినప్పటికీ గత ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్ళించారని దీనిపై నివేదికలు లేవని విచారణ చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. పలువురు అధికారులు ఆయనను సత్కరించారు.



భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు క్రైం, జూలై 17 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజినల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ కేసులు, ఇంక్రిమెంటు కోతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నాయకురాలు కె.రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో బుధవారం బహుజన ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల, ఎంఆర్‌పీఎస్ సంఘం నాయకులు సమావేశమయ్యారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అన్ని డిపోల్లో అక్రమ ఓడీలను అరికట్టి అర్హులైన ఉద్యోగ సిబ్బందికి అవకాశం కల్పించాలన్నారు. అదే విధంగా ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తరువాత కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 2019/1 శిక్షా స్మృతులను అమలు చేయకుండా 1964 శిక్షా స్మృతులను అమలు చేస్తున్నారని వీటిని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అనుమానాస్పద మృతిపై కుటుంబ సభ్యులు డిసెంబర్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకూ ఏ విధమైన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి కారణంతోనే దర్యాప్తు చేయకుండా రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారన్నారు. ఆయన మృతిపై సీబీసీఐడి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి గోరింక అనిల్‌కుమార్, బహుజన ఎంప్లాయిస్ అసోసియేషన్ ఛైర్మన్ ఫరీద్ ఖాసీమ్, ప్రధాన కార్యదర్శి చిర్రా సామ్‌సన్, జిల్లా కార్యదర్శి రాజా, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల చంటి, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎడారి ఊరిలో..

పొట్టికూటి కోసం కన్నవారిని, కట్టుకున్న భార్యను వదిలి గల్ఫ్ దేశాలకు వెళ్లి చాలామంది మోసపోతున్నారు. అప్పోసప్పో చేసి అక్కడకు వెళితే ఉపాధి దొరక్క నానా తిప్పలు పడి ఉసూరుమంటూ వెనక్కు వస్తున్నారు. ఉన్న ఊరులో బతకలేక బతుకు దెరువు వెతుక్కుంటూ కుటుంబాలను వదిలి గల్ఫ్ దేశాలకు వెళితే అక్కడ దళారులు చేస్తున్న మోసాలకు ఎంతోమంది బలవుతున్నారు. విజిట్ వీసాలతో వెళ్లి అక్కడ నిలువు నీడ లేక ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారు.

నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన జయరాంకు భార్య ఇద్దరు ఆడ పిల్లలు. ఎల్‌కెజీ, నర్సరీ చదువుతున్నారు. వ్యవసాయ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. వయసులో ఉన్నప్పుడే నాలుగురాళ్లు సంపా దించుకోవాలనే తాపత్రయంతో తెలిసిన వారి ద్వారా ఏజెంటును సంప్రదించి దుబాయ్ వెళదామనుకున్నాడు. మంగళసూత్రాలు తాకట్టుపెట్టి ఏజెంట్‌కు లక్షా 50 వేల రూపాయలు ఇచ్చాడు. సొమ్ములు చెల్లించి 25 రోజులు గడు స్తున్నా వర్క్ వీసా ఇవ్వలేదు.గట్టిగా అడిగేసరికి టూరిస్టు వీసాతో దుబాయ్ విమానం ఎక్కించేశాడు. అక్కడ వర్క్ వీసా లేకపోవడంతో అక్కడి ఏజెంట్లు 15 రోజుల పాటు నరకం చూపించారు. అక్కడికి ఇక్కడకు తిప్పుతూ షార్జా సమీపాన గత హజ్‌మాన్‌లో ఊరిచివర ఒక చిన్న గదిలో బంధించగా తప్పించుకొని వచ్చినట్టు జయరాం చెప్పుకొచ్చాడు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టి ఐటీఐ చదివిన పత్తేపురం గ్రామానికి గెడ్డం ప్రవీణ్ ఇక్కడ సరైన ఉపాధి లేకపోవడంతో దుబాయ్ వెళ్లి సంపా దించుకోవచ్చనే ఆశతో విమానం ఎక్కితే ఏజెంట్ చేసిన మోసాలకు బల య్యాడు. ఎయిర్‌పోర్టులో జాబ్ అని చెప్పి మోసం చేసి సొమ్ములు కాజేశారు. వర్క్ వీసా లేకపో వడంతో అక్కడి ఏజెంట్లు రోజుకో రూము మార్చి చివరికి ఊరి చివర రూములో బంధించగా తప్పించుకొని అక్కడే తెలిసిన వారి దగ్గర ఉంటూ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. గత నెలలో దుబాయ్ లో ఏజెంటు ద్వారా వెళ్లి పని దొరక్క అక్కడే చిక్కు పడిపోయాడు. తమ వద్ద 1 లక్షా 30 వేలు వసూలు చేసి ఏజెంట్ మోసం చేసిందని అతని సోదరుడు కిషోర్ ఆంధ్రజ్యోతి వద్ద వాపోయాడు.

పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు..
ఏజెంట్ల దోపిడీతో అవస్థలు
విజిట్ వీసాలతో బిక్కుబిక్కుమంటూ..
తిరిగి వచ్చేందుకు నానా అగచాట్లు

భీమవరం రూరల్/ భీమవరం క్రైం/ నిడమర్రు, జూలై 17 : గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్ళేవారికి ప్రాణ సంకటంగా మారుతోంది.. మధ్య వర్తిగా వ్యవహరించే ఏజెంట్లు దోపిడీతో ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగాలు



లేక అవస్థలు పడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దిక్కుతోచని పరిస్థితుల్లో గల్ఫ్ దేశాలలో ప్రాణాలు విడుస్తుంటే మరికొందరు తిరిగి వచ్చేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. కొన్నిరోజుల క్రితం పశ్చిమ గోదావరి జిల్లాలోని నిడమర్రు, పాలకోడేరు పలు మండలాల నుంచి 10 మందికి పైగా యువత ఉద్యోగాల కోసం గల్ఫ్ దేశాలు వెళ్లి మోసపోయారు. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలోని ఒక మహిళా ఏజెంట్ మోసపూరిత వ్యవహారంతో అక్కడ ఉద్యోగం పొందలేకపోయారు. దీనిపై అక్కడ నుంచి వారు వాట్సాప్ వీడియోల ద్వారా మోసపోయామని, తిరిగి రావడానికి దారి చూపాలని వారు పంపిన వీడియో వైరల్ అయింది.

అప్పు చేసి వెళ్తున్నారు.. ఉపాధి లేక వస్తున్నారు..

గల్ఫ్ దేశాలకు వెళ్ళాలంటే లక్షల రూపాయలు ఏజెంట్ చేతిలో పెట్టాల్సి వస్తుంది. మధ్యతరగతి కుటుంబీకులు ఆదాయం పెంచుకునేందుకు అప్పులు చేసి మరీ ఏజెంట్ల చేతిలో సొమ్ములు పెడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఇదొక వ్యాపారంగా పెట్టుకున్న మోసపూరిత ఏజెంట్లు మధ్య తరగతి కుటుంబాలను మోసం చేస్తున్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్ళినవారు మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. అక్కడ సరైన ఉద్యోగాలు లేకపోవడంతో ఇళ్లల్లో పాచిపనులకు కూడా చేరుతున్నారు. దీంతో యజమానులు పెట్టే చిత్ర హింసలు భరించలేక వెళ్లిన కొద్ది రోజులకే తిరిగి వచ్చేస్తామంటూ సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తున్నారు. జిల్లాలోని పాలకొల్లు, పోడూరు, పాలకోడేరు, నర్సాపురం, మొగల్తూరు, భీమవరం మండలాలకు సంబంధించిన ఎక్కువ మంది మహిళలు ఇలా మోస పోయినవారిలో ఉన్నారు. ఇటీవల అన్నమయ్య జిల్లా వాసి ఒకరు తన ఇబ్బందులను సోషల్ మీడియాలో పోస్టు చెయ్యడంతో మంత్రి నారా లోకేష్ స్పందించి అతడిని స్వదేశానికి రప్పించారు.

మోసపోయిన వారెందరో..

- మూడేళ్ల క్రితం భీమవరం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఒక 30 సంవత్సరాల మహిళ దుబాయ్ వెళ్లింది. ఏజెంట్ మోసం చేయడంతో అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంది. కుటుంబ సభ్యులకు తెలియ జేయడంతో పోలీసుల ద్వారా ఆమె స్వదేశానికి వచ్చింది.
- పోడూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒక మహిళ చేసిన అప్పులు తీర్చలేక ఖత్తర్ దేశానికి వెళ్ళి ఇబ్బందులు ఎదుర్కొంది. మొత్తం మీద ఆమెను అక్కడి అధికారులతో మాట్లాడి స్వదేశానికి తీసుకువచ్చారు.
- పాలకోడేరు మండలానికి చెందిన ఒకరు గల్ఫ్ దేశాలకు వెళ్ళి అక్కడ ఉండలేక ఏజెంటు చేసిన మోసానికి స్వదేశానికి తిరిగి వచ్చేశారు. అలా వచ్చేయడం వల్ల రూ.3 లక్షల వరకు నష్టం వచ్చింది.
- మొగల్తూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తోటపని చేసేందుకు గల్ఫ్ వెళ్ళారు. తీరా అక్కడ ఒంటెలను పెంచాలని చెప్ప డంతో నానా అవస్థలు పడ్డారు. ఇచ్చిన సొమ్ము నష్టపోయినా తిరిగి ఇంటికి వచ్చేశారు.
- ఉండి మండలానికి చెందిన ఒక వ్యక్తి ఉద్యోగం ఉందని గల్ఫ్ దేశానికి పంపించారు. తీరా అక్కడకు వెళ్ళిన తరువాత జంతువుల మాంసం కొట్టే పని చెప్పడంతో ఖంగుతిని నెలరోజులకే తిరిగి వచ్చేశాడు.

• నకిలీ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటాం

పశ్చిమ ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



నకిలీ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటాం. ఎవరూ కూడా ఏజెంట్లు మాటలు నమ్మి గల్ఫ్ దేశాలకు వెళ్ళి మోసపోవద్దు. రిజిస్ట్రేషన్ ఉన్న ఏజెంట్లు ద్వారా మాత్రమే ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాలి. ఏజెంట్ల మోసాలపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

• నరకం చూశాను..



నా భార్య ఇద్దరు ఆడపిల్లలు.. వారిని వదిలి బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లేందుకు ఏజెంట్‌కు లక్షా 50 వేలు ఇచ్చాను. అక్కడ పని లేదు.. డబ్బు పోయింది. సుమారు 55 రోజులు తీవ్ర నరకం చూశాను. ఎలాగోలా తప్పించుకొని ఇండియాకు చేరుకొన్నా. ఏజెంటు నుంచి మాకు రావల్సిన సొమ్ము ఇప్పించాలి.

– గణసల వెంకట్రాజు, తోకలపల్లి ,నిడమర్రు మండలం

• సెక్యూరిటీ ఉద్యోగమంటే వెళ్లాను



ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ ఉద్యోగ మంటే విమానమెక్కాను. ఏజెంటు కు 1 లక్షా 50 వేలు ఇచ్చాం. టూరిస్టు వీసా మీద వెళ్లిన మేము చివరకు 50 రోజుల పాటు ఎన్నో చిత్రహింసలకు గురయ్యాం. మానసికంగా ఎంతో క్షోభ అనుభవించాం. ఇంటి నుంచి డబ్బులు తెప్పించుకొని స్వగ్రామం చేరుకొన్నాం. మమ్మల్ని మోసం చేసిన ఏజెంట్ జాన్సీని వెంటనే శిక్షించాలి. మాకు డబ్బులు ఇప్పించేలా చూడాలి

-జయరాం, తోకలపల్లి

ఎంపీడీవో ఎక్కడున్నారు ?



ఇంకా లభించని ఆచూకీ
విజయవాడ, ఏలూరు జిల్లాల్లో గాలింపు

నరసాపురం రూరల్, జూలై 17: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ ఆచూకీ లభించ లేదు.కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు విజయవాడ, ఏలూరు జిల్లాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఏలూరు కాల్వ వద్ద ఎంపీడీవో చెప్పులు కనిపించడంతో గజ ఈతగాళ్లతో కాల్వ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ దొరక లేదు. నరసాపురం రేవు నిర్వహణదారుడు రెడ్డప్ప ధవేజీ మండల పరిషత్‌కు రూ.55 లక్షల వరకు చెల్లించాలి. ఈ బాకీ వసూలు విషయమై ఆయన రెండు నెలల నుంచి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నెల 3 నుంచి మెడికల్ లీవ్ పెట్టి కృష్ణా జిల్లా పెనమలూరులో ఆయన ఇంటి వద్దనే ఉంటున్నారు. 17 వ తేదీ సోమవారం మచిలీపట్నం వెళ్లిన ఎంపీడీవో ఇంటికి తిరిగి రాలేదు. ఎంపీడీవో సెల్ నుంచి భార్యకు మెసేజ్ రావడంతో కుటుంబ సభ్యులు పెనుమలూరు పోలీస్‌లను ఆశ్రయించారు. రెండు రోజుల నుంచి అన్ని కోణాల్లో గాలించినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఇప్పటి వరకు పోలీసులు మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ఎంపీడీవో బైక్‌ను, విజయవాడలోని ఏలూరు కెనాల్ వద్ద ఆయన చెప్పులను మాత్రమే గుర్తించారు. దీంతో ఆయన అదృశ్యం పెద్ద మిస్టరీగా మారింది. ఎంపీడీవో ఇంటికి క్షేమంగా రావాలని మండల పరిషత్ ఉద్యోగులతో పాటు సిబ్బంది, పట్టణ ప్రజలు కోరుకుంటు న్నారు. బకాయిపడ్డ ధవేజీ నుంచి ఎటువంటి స్పందన లేదు. కనీసం మండల పరిషత్ అధికారులతో ఆయన చర్చించ లేదు. దీంతో బాకీ కడతారా ? లేదా అన్న దానిపై పెద్ద చర్చ సాగుతోంది.

• ఆయనకు ఏమైనా జరిగితే బాధ్యులపై కేసులు
ఎమ్మెల్యే నాయకర్



తన సర్వీస్‌లో అవినీతి మచ్చ లేకుండా నిజాయితీగా పని చేస్తున్న ఎంపీడీవో వెంకటరమణకు ఏమైనా జరిగితే మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, నిర్వహణదారుడు రెడ్డప్పధవేజీ, జేపీసీ కమిటీ సభ్యులపై కేసు పెడతామని ఎమ్మెల్యే నాయకర్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాకీ విషయంపై రేవు నిర్వహణ దారుడు ధవేజీకి అనేకమార్లు ఫోన్‌లు చేసినా, నోటీసులు ఇచ్చినా స్పందించ లేదన్నారు. ఇదే విషయం ఎంపీడీవో రెండు మూడు సార్లు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. బాకీ విషయంలో ఎంపీడీవో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మెడికల్ లీవ్ పెట్టారన్నారు. ముదునూరి నిర్లక్ష్యం వల్లే నిజా యితీపరుడైన ఎంపీడీవో బలి కావాల్సి వచ్చిందన్నారు. ఆయనకు ఏమైనా జరిగితే ఆ కుటుంబానికి ఏం సమాధానం చెపుతారంటూ నిలదీశారు. అవసరమైతే సీఎం చంద్రబాబు, జిల్లా కలెక్టర్ వద్దకు సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆయన ఎక్కడ ఉన్న క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

ఎంపీడీవోకు అండగా ఉంటాం : పొత్తూరి



ఎంపీడీవో, ఆయన కుటుంబ సభ్యులకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు భరోసా ఇచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ అవినీతి ఆక్రమాలకు ప్రజలతో పాటు అధికారులు కూడా బలయ్యారన్నారు. బకాయిదారుడు పెండింగ్ సొమ్ము చెల్లించకపోవడం వల్లే ఎంపీడీవో మానసిక ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయరాన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

భీమవరం క్రైం, జూలై 17 : తనను ప్రేమించలేదన్న కోపంతో ఒక యువకుడు తోటి విద్యార్థిని ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చెయ్యడంతో అతనిపై పోక్సో కేసు నమోదైంది. భీమవరం శివారు ప్రాంతానికి చెందిన ఒక బాలిక ఇంటర్ చదువుతుంది. ఆమె తోటి విద్యార్థి టి.నర్సాపురం మండలం వెలగపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణ అదే కళాశాలలో చదువుతున్నాడు. బాలికతో స్నేహంగా ఉంటూ ప్రేమించమని వేధించేవాడు. ఆ విషయం కళాశాల దృష్టికి వెళ్ల డంతో అతనికి టీసీ ఇచ్చి పంపించివేశారు. అది మనసులో పెట్టుకుని గతంలో ఆ బాలికతో కలిసి దిగిన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చెయ్యడంతో కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అత్యాచార నిందితులు నలుగురి అరెస్ట్

టి.నరసాపురం, జూలై 17: మండలంలో ఒక గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక పై అత్యాచారానికి పాల్పడిన యువకునితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అత్యాచార ఘటనపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నాగ కుమార్‌తో పాటు అతనికి సహకరించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపారు.



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన హర్యానా బృందం

వెల్లమిల్లిలో ప్రకృతి వ్యవసాయంపై హర్యానా బృందం పరిశీలన

ఉంగుటూరు, జూలై 17 : మండలంలోని వెల్లమిల్లి, నాచుగుంట గ్రామాల ఆయకట్టులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను హర్యానాకు చెందిన బృందం సందర్శించింది. రైతులు, అధికారులు, సర్పంచుల బృందం జిల్లాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఇక్కడి క్షేత్రాలను సందర్శించి వివిధ పంటల పరిస్థితులను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీనివాసరావు (మండల వ్యవసాయాదికారి) జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ తాతారావు, అసిస్టెంట్ మేనేజర్ వలి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్లు నాగమణి, సంధ్యారాణి, సత్య తదితరులు పాల్గొన్నారు. పంట దిగుబడి, కాలపరిమితి తదితర అంశాలపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఐపీఎస్ అధికారుల సాధారణ బదిలీలు

ఏలూరు క్రైం, జూలై 17 : ఐపీఎస్ అధికారుల సాధారణ బదిలీల్లో ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న జిల్లాలకు నూతన ఎస్పీలను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే కొంత మంది విధుల్లోకి చేరి ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందిం చారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా నరసింహ కిషోర్, కృష్ణా జిల్లా ఎస్పీగా రెడ్డి గంగాధరరావు, కాకినాడ జిల్లా ఎస్పీగా విక్రమ్ పాటిల్, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వీరందరూ బుధవారం ఏలూరు డీఐజీ కార్యాలయానికి వచ్చి ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

111 మంది ర్యాంకర్ ఎస్ఐలు బదిలీ

ఏలూరు క్రైం, జూలై 17 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న ఎస్ఐలలో 111 మందిని ఎన్నికల నియమావళిని అనుసరించి సొంత జిల్లాకు చెందిన ఎస్ఐలను వేరే జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో ర్యాంకర్ ఎస్ఐలను తిరిగి ఏ జిల్లా నుంచి వచ్చారో ఆ జిల్లాలకే పంపించడానికి రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న 111 మంది ఎస్ఐలు ఎన్నికల ముందు ఏ జిల్లా నుంచి బదిలీ అయ్యారో తిరిగి ఆ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలకు గురువారం రిపోర్టు చేయనున్నారు. తిరిగి వారికి ఆ జిల్లాలో సంబంధిత ఎస్పీలు పోస్టింగ్‌లు ఒకటి రెండు రోజుల్లో కల్పించనున్నారు.

పట్టిసీమ నుంచి 3,540 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం జూలై 17 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 3,540 క్యూసెక్కుల వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు బుధవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.559 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10 పంపులు 10 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకూ 6.6218 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్వేలోకి నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.970 మీటర్లు, స్పిల్వే దిగువన 17.050 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.070 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 16.120 మీటర్లు నమోదైనట్లు ఈఈలు వెంకటరమణ,మల్లికార్జునరావు తెలిపారు.

బోరు పైపును పూడ్చిన అగ్నిమాపక, ఓఎన్‌జీసీ అధికారులు



ఆచంట, జూలై 17 : ఆచంట శివారు కోనపోతు గుంటలో బండి వెంకటకృష్ణకు చెందినబోరు పైపు నుంచి మంగళవారం రాత్రి వింత శబ్దాలు వాయువుతో కూడిన బురద మట్టి, గ్యాస్ పైకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సమాచారాన్ని అగ్నిమాపక, ఓఎన్‌జీసీ అధికారులకు అందించడంతో జిల్లా అగ్నిమాపక అధికారి బి. శ్రీనివాసరావు సహాయ అధికారి జానకి రాము, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి, సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి తాత్కాలికంగా మట్టితో పూడ్చి వేశారు. అనంతరం బుధవారం అధికారులు మరోసారి పరిశీలించారు. పైపుపై ఇసుక వేసి సగం వరకు పూడ్చి వేసి తరువాత బ్యాలెట్ పౌడర్‌తో భూమికి సమాంతరంగా పూడ్చారు. ఇక ఎటువంటి భయం ఉండదని అధికారులు స్థానికులకు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైసీపీ ఐదేళ్ల కుంభకోణాలు తెలుపుతాం : తోట

భీమవరం అర్బన్, జూలై 17: వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, అవినీతి, కుంభకోణాలు దోపిడీలన్నావాటిపై ఏపీ ప్రభుత్వం శ్వేత పత్రాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. వైసీపీ పాలనలో 1.75 లక్షల ఎకరాల భూమి ఆక్రమణకు గురయ్యాయని, ఇళ్ల పట్టాల పేరుతో పనికిరాని ఎకరాల భూమి, ఐనుక దందాలో రూ.9,750 కోట్లు దోచుకున్నారని విమర్శించారు. జగన్ తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టును ఎన్డీఏ రద్దు చేసిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే హామీలను నెరవేర్చుతున్నారని ప్రశంసించారు.

రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యం


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 17: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం వేల్పూరు విఘ్నేశ్వర నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 60 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన పనులను మాజీ మంత్రి కారుమూరి ప్రభుత్వంగా నిలిపి వేశారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో రూ. 200 కోట్లు నిధులు దేయడం జరిగిందని వివరించారు. సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచ్ గుబ్బల రాజారావు, టీడీపీ నాయకులు చిట్టూరి సునంద, రెడ్డి నరేంద్ర ప్రసాద్, ఆయినంపూడి శ్రీదేవి, పితాని మోహన్, చిక్కాల వేణు, రెడ్డి కేశవరావు, వల్లూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేల్పూరులో మెయిన్ రోడ్డు పక్కన ఉన్న డంపింగ్ యార్డు, గొస్వేని కాల్వను ఎమ్మెల్యే ఆరిమిల్లి పరిశీలించారు. చెత్త వేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటి అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

అగ్ని, సూర్యారాధనతో రోగాలు తగ్గుతాయి

పెనుమంట్ర, జూలై 17: సమస్త కోటి ప్రాణికి అగ్ని సూర్యారాధన ద్వారా రోగ పీడలు నివారించవచ్చని శ్రీదత్త వేద కోంగర్గుం పీఠాధిపతి శ్రీసాయి దత్త నాగానంద సరస్వతి అన్నారు. బుధవారం పాలకోడేరు మండలం శృంగవృక్షం దత్తపీఠం నుంచి శిష్య బృందంతో ఆయన పీఠాపురం పాదయాత్రగా బయలుదేరారు మార్గమధ్యలో పెనుమంట్ర మండలం పొలమూరులో హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మహిళా భక్తుల స్వామికి స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు. 18 ఏళ్లుగా ప్రతి ఏడాది శ్రీదత్త పీఠం నుంచి పీఠాపురం స్వయం దత్తపీఠానికి పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. కాలుష్యం పెరిగి రోగాలు బారిన పడుతున్న మానవాళికి అగ్ని సూర్య ఆరాధన వల్ల రోగాలను తరిమికొట్టవచ్చని ప్రతిఒక్కరూ సూర్యారాధనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. హిందూ పరిషత్ సభ్యులు వాదపల్లి పృథ్వీరాజ్, తుపాకుల గోవింద్, హిందూ భక్త బృందం పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 17: వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలన్నింటిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలపై కావాలనే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు... (పేర్లు) సిద్ధుయుల కృష్ణమోహన్, ముప్పిడి రమేష్, దాట్ల జగన్నాధరాజు పాల్గొన్నారు.

ఎస్పీ నయీంను కలిసిన ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 17: జిల్లాలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ నయీంను భీమవరంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం తాడేపల్లిగూడెంలోని శాంతిభద్రతల సమస్యలపై ఎస్పీతో మాట్లాడారు.

వారాహి మాత గుప్త నవరాత్రులు ముగింపు

ఆకివీడు, జూలై 17 : వారాహిమాత గుప్త నవరాత్రులు ముగింపు సందర్భంగా బుధవారం స్వామి వెంకటలింగేశ్వరస్వామి దేవస్థానంలో వారాహి మాతకు భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ మండల-పట్టణ అధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, ఫోర్ భీమ్ బొల్లా వీరాస్వామి-శేషుబాబు, బచ్చు నరకుమారి, బొర్రా సుజాత, కిమిడి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో సమతానగర్ మహిళల నిరసన

ఆకివీడు, జూలై 17: నల్లాల్లో నీళ్లు ఎద్దుల్లా ఒక్కటో రెండో... గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్నామని, రహదారుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు పాలకులు, అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదని సమతానగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సమతానగర్ మహిళలు గుక్కెడు మంచినీళ్లు ఇవ్వండి అంటూ ఖాళీ బిందెలతో నిరసన తెలిపి మాట్లాడారు. ఆరు రోజులుగా నగర పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు తమ ప్రాంతానికి రావడంలేదన్నారు. పైపులైను మరమ్మతులు చేయించి తమ ప్రాంతానికి మంచినీరు సరఫరా చేయాలన్నారు. డి.శక్యాణి, బైర మాణిక్యం, గుడాల సంధ్య, చిట్టి కుమారి, దుర్గా మరియమ్మ, పద్మ మాధవి, గుడాల నాగమణి, బోడపాటి తదితరులు పాల్గొన్నారు.

విశ్వదుర్గేశ్వరీ అమ్మవారికి ఆషాఢ సారె


సారె తీసుకెళ్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 17: తాడేపల్లిగూడెం పట్టణంలోని విశ్వదుర్గేశ్వరీ అమ్మవారికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ కుటుంబ సభ్యులు బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. భారీగా మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేసి పూజలు చేశారు. సారెలో వంద రకాలకు పైగా స్వీట్లు నివేదించారు.

చెత్త తొలగింపు

ఇరగవరం, జూలై 17 : ఇయనపర్రులో రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్తను పంచాయతీ అధికారులు తొలగించారు. 'ఇమ్మళ్ళు, మూసుకోవాలే నడవలేం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి నవీన్ స్పందించి పంచాయతీ సిబ్బందితో చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

సంక్షిప్త సమాచారం..

- తాడేపల్లిగూడెం రూరల్: ప్యారేళ్లలు మానవ విలువలను వేలా ది మంది విద్యార్థులకు తెలియజేస్తే బలమైన సమాజ వ్యవస్థ నిలబడు తుందని పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలోని సమావేశంలో మహారాష్ట్ర ఎస్ఐసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పుష్పాలత్ పాటిల్ పేర్కొన్నారు.
- పెనుగొండ : పెనుగొండ ఎన్‌ఆర్‌ఐ విల్లాలో పలువురు అనాథ పిల్లలకు, రోగులకు పెనుగొండ టీడీపీ నాయకులు మండా ప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా పెనుగొండ శాఖ మానవత ఆధ్వర్యంలో డాక్టర్ విజయ్‌రావు ఆధ్వర్యంలో పౌష్టికాహార కిటలను అందజేశారు.
- భీమవరం అర్బన్ : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో భీమవరం తాడేరు రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో ఆపదవ లోపంతో ఇబ్బంది పడుతున్న ముగ్గురికి నిత్యావసరాలు అందించారు.
- నరసాపురం టౌన్ : జనసేన ఎమ్మెల్యే నాయకర్ ఆధ్వర్యంలో మెగాస్టార్ విజయం సాధించడంపై బుధవారం ఎన్టీఆర్ కాలనీలో 108 కొబ్బరికాయలు కొట్టి జనసేన నాయకులు భీమాల శ్రీనివాస్ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు.
- పెంటపాడు : పెంటపాడు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.


పెంటపాడు బైరాగి మఠం వేణుగోపాలస్వామి.. ఆకివీడు శ్రీవారు.. భీమవరంలో సోమేశ్వరస్వామి.. రుస్తుంబాద జగన్నాథస్వామికి టీడీపీ నాయకుల పూజలు

తొలి ఏకాదశి పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

భీమవరం టౌన్, జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయంలో జనార్దన స్వామి, సోమేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అలంకరణ చేశారు. మహిళలు సామూహిక విష్ణు సహస్ర పారాయణ చేశారు. దాసాంజనేయస్వామి ఆలయంలోను, దుర్గాపురంలోని పంచముఖ స్వామి, తదితర ఆలయాల్లో పూజలు జరిగాయి. జాషువా లెంకోట్లలోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి శాకాంబరి దేవిగా అలంకరణ చేశారు. ఆలయంలో 40 మంది దంపతులచే సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని శాకంబరి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

● పాలకొల్లు అర్బన్/ఆచంట/మొగల్తూరు/ఉండి/పెంటపాడు/ఆత్తిలి /ఆకివీడు/తాడేపల్లిగూడెం రూరల్ : పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి, జనార్దనస్వామికి పూజలు చేశారు. 24వ వార్డు శంకర్పు అగ్రహారంలోని వేంకటేశ్వర స్వామికి చందన అలంకారం చేసి సహస్రనామ అర్చనలు జరిపించారు. కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక శ్రీరమా సత్యనారా యణ స్వామివారి వ్రతం చేశారు. షైర్ మార్కెట్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో, అష్టదళ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈవో బీవీ శంకర్, భక్తులు పాల్గొన్నారు. ఆచంట మండలంలోని ఆచంట వేంకటేశ్వరస్వామి, కొడమంచిలిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆధ్యాత్మిక గురువు మనేపల్లి ఉమా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మొగల్తూరు మండలం మొగల్తూరు వడయార్ పేటలోని వనమల్లికార్జున ఆలయ ప్రాంగణంలోని పాండు రంగస్వామికి కల్యాణ మహోత్సవాన్ని కారుమూరి రామసుబ్బారావు సీతామహాలక్ష్మి దంపతులచే కల్యాణం నిర్వహించారు. మొగల్తూరులోని పురాతన రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉండి మండలం ఉండి చెన్నమల్లేశ్వరస్వామి ఆల యం, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నియో జకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. పెంటపాడు మండలం బైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు జరిపారు. పెంటపాడు బాల వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆత్తిలి మండలం ఈడూరు వరాల వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. 700 లీటర్ల ఆవుపాలు, 10 లీటర్ల పెరుగు, ఏడు కేజీల చొప్పున నెయ్యి, పసుపు, తేనె, కుంకుమ, తెల్ల ఆవాలు, పట్టీలతో అభిషేకం చేశారు. ఆత్తిలి వేణుగోపాలస్వామి, బల్లిపాడు మదనగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆకివీడు పట్టణం, మండలంలోని పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో, హౌసింగ్ బోర్డు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కూటమి పాలన బాగుండాలని టీడీపీ పూజలు

నరసాపురం టౌన్ : రాష్ట్రంలో కూటమి పాలన బాగుండాలని బుధవారం టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని రుస్తుంబాద జగన్నాథస్వామి ఆలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి నాయుడు ఆరోగ్యంతంగా ఉండాలంటూ పూజలు చేశారు. సంకు బాస్కర్, మల్లాడి మూర్తి, బాబు, మురళీ, రవి, గుగ్గిలపు బుజ్జి, ముత్యం, నాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రోడ్లకు మహర్దశ

రూ.2.89 కోట్లతో మేడపాడు- రావిగొప్పు రోడ్డుకు శంకుస్థాపన


రావిపాడులో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల

పోడూరు/పాలకొల్లు అర్బన్, జూలై 17 : రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రోడ్లకు మహర్దశ పట్టనుందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పీఎంజీఎస్‌వై నిధులు రూ.2కోట్ల 89లక్షలతో చేపట్టనున్న పోడూరు మండలం మేడపాడు నుంచి నేరేడుమిల్లి, రావిపాడు, రావిగొప్పు మీదుగా ఆచంట వేమవరం వెళ్లే బీటీరోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డుకు గతంలోనే ప్రారంభించిన త్వరలో రోడ్డును పూర్తిచేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు ధాన్యం బకాయిలు రూ.1650 కోట్లు చెల్లించకుండా అప్పుల ఊబిలోకి నెట్టేసిందని విమర్శించారు. రైతుల ఆర్థిక పరిస్థితిని చూసి వెంటనే ఆ కోట్లు రూపాయలు చెల్లించామన్నారు. డ్రెయిన్లు, కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు రూ.90కోట్లు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశామన్నారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పెన్మెత్స విజయలక్ష్మి రంగరాజు అధ్యక్షత వహించారు. కూటమి నాయకులు పెన్మెత్స రామభద్రరాజు, పెచ్చెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం పట్టణంలో అంసూర్పేగు మిగిలిన గౌడ, శెట్టిబలిజ కమ్యూనిటీ భవనాన్ని మంత్రి నిమ్మల, కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఆ సమీ పంలోనే ఉన్న ముస్లిం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. వీటిలో ఎస్సీ కమ్యూనిటీ భవనం పనులు పూర్తయ్యాయని, ముస్లిం, బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులు 2019లో ఆగిపోయి ఉన్నాయి యథావిధిగా ఉన్నాయన్నారు. ఈ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడం, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చు చేయడం తదితర సమస్యలపై నియోజకవర్గంలోని ఆశా కార్యకర్తలు మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేశారు. మంత్రి కార్యాలయంలో బుధవారం నియోజక వర్గ ఆశా వర్కర్లు 90 మంది కలిసి వినతి పత్రంతో పాటు మొక్కను అందించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఎస్పీ నయీం

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు టౌన్ : జిల్లా ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అద్నాన్ నయీం అస్మీ పాలకొల్లులో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలోని శాంతి భద్రతలపై ఎస్పీతో మంత్రి నిమ్మల చర్చించారు.

ఎమ్మెల్యే అంజిబాబును కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీలు

భీమవరంటౌన్/భీమవరం క్రైం, జూలై 17 : భీమవరం ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లు వలస మణికుమార్, కార్యదర్శి ఉండపల్లి రాంబాబు ఉపాధ్యక్షుడు శేఖ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మోగల్లు మాజీ సర్పంచ్ పుష్పవతి మృతి


పుష్పవతి (ఫైల్)

పాలకోడేరు, జూలై 17: మోగల్లు గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపల్లి పుష్పవతి(56) బుధవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కేవీఎస్ సూర్యనారాయణరాజు సతీమణి పుష్పవతి కొన్నిరోజులుగా అనారోగ్యంతో భీమవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె మృతదేహాన్ని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘు రామకృష్ణరాజు, పాలకోడేరు మాజీ సొసైటీ ఛైర్మన్ అడ్డాల కొత్తపల్లి నాగరాజు, మోగల్లు సర్పంచ్ మల్లిపూడి శ్రీనివాస్, సత్యశ్రీ సంకురు, మాజీ సర్పంచ్ కోడమంచిలి ప్రభాకరరావు, తదితర తెలుగుదేశం, జనసేన నాయకులు ఆమె భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

వ్యాధిగ్రస్తులకు మంచి వైద్యం అందించాలి

» ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఆకివీడు, జూలై 17 : ప్రభుత్వాసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్తులకు వైద్యులు మంచి వైద్యం అందించాలని ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు సూచించారు. స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు ఎంత మంది ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌సీ పక్కనే ఏళ్ల తరబడిగా ఉన్న ఆసిడ్ డంపింగ్‌యార్డు సమస్యను కలెక్టర్‌తో మాట్లాడి ఇంకా రోజుల్లో తొలగిస్తామన్నారు. ఎమ్మెల్యే నిధులు ఉద్యోగుల భవన నిర్మాణ పూర్తైనా జరగకపోవడంతో సంబంధిత అధికారి ఏపీఎంఎస్ఐడీసీ డీఈ శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. ఆసుపత్రిలో దాతల సహకారంతో డైయాసిస్, తాగునీరు సమస్యను పరిష్కరించి ఆసుపత్రి ప్రాంగణం సుందరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.నారాయణరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ నజరిన్, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి తదితరులు ఉన్నారు.


రక్తంతో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే రఘురామ... కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఘనంగా ముత్యాల రత్నం పుట్టినరోజు వేడుకలు

రాజకీయ కురువృద్ధుడు, ఉద్దండుడు ముత్యాల రత్నం అని బీజేపీ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ముత్యాల రత్నం జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం ఐ.భీమవరంలో ఆయన నివాసానికి వచ్చి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు కేక్ కట్ చేశారు. బోలిశెట్టి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, పాకా సత్యనారాయణ, నార్ని తాతాజీ, కొమ్మన నాగబాబు తదితరులు ఉన్నారు.

దాతల సాయంతో కాల్వలు అభివృద్ధి చేస్తాం

దాతల సాయంతో కాల్వలు అభివృద్ధి చేస్తామని, ప్రతీ ఎకరానికి నీటిని అందించడంతో పాటు ముంపు సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. కాల్వల అభివృద్ధి సహాయనిధికి రైతులు వేళ్ళ వెంకట కృష్ణంరాజు లక్ష రూపాయలు, దుంపూరి సత్యనారాయణ రూ.25వేలు, గొదవర్తి సుబ్బారావు లక్ష రూపాయలు, మోటుపల్లి సుబ్బారావు రూ.15వేలను సంబంధించిన చెక్కులు అందజేశారు.

లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం

గణపవరం, జూలై 17: ప్రపంచంలోనే అత్యుత్తమ స్వచ్ఛంద సేవా సంస్థ లయన్స్ క్లబ్ అని ఆ సంస్థ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వి.సుబ్బారావు అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో గణపవరం లయన్స్‌క్లబ్ 2024-25 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. నూతన అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీఎస్.విశారద ప్రమాణం చేశారు. వీరితో పాటు మరికొంత మంది సభ్యులచే ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ డైరెక్టర్ సుబ్బారావు ప్రమాణస్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ,రీజియన్ ఛైర్‌పర్సన్ కృష్ణమూర్తి, జోన్‌ఛైర్‌పర్సన్ పోసంశెట్టి రామమూర్తి, మార్కెటింగ్ ఛైర్మన్ కాశ్యాని సత్యనారాయణ మూర్తి, మాజీ అధ్యక్షుడు కిలారి రవిబాబు, వేల్పూరి నరేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆధునికీకరణకు శరవేగంగా చర్యలు

భీమవరంటౌన్, జూలై 17 :భీమవరం పురపాలక సంఘం రూపురేఖలు మారబోతున్నాయని, సుందరీకరణ, ఆధునికీకరణ ముమ్మరాల్లా కుదిరాయని, అభివృద్ధి పనులను శరవేగంగా చేపడతామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో రూ.40 లక్షలతో చేపడుతున్న ఇంటర్నల్ రోడ్లు, పేవర్ బ్లాక్ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో చాలా రోడ్లు దెబ్బతిన్నాయని త్వరితగతిన అభివృద్ధి చేస్తామని, మున్సిపల్ కార్యాలయంలో పాతబడిన బిల్డింగ్‌ను పడగొట్టి ప్రత్యామ్నాయ బిల్డింగ్ కోసం చిందర్లు పిలుస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఇంజనీర్ త్రినాథరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, పొత్తూరి బాపిరాజు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ అధ్యాపకులపైనే

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 17 : ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని, విద్యార్థుల భవిష్యత్ అధ్యాపకులపైనే ఆధారపడి ఉందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరంలోని ఆశీఐడీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.40 లక్షలతో నిర్మించిన ఆదనపు తరగతుల గదులను శాసనమండలి ఛైర్మన్ కొయ్యె మోషేన్‌రాజు, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో అవసరం మేరకు అదనపు తరగతులను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబు, రఘురామకృష్ణంరాజులను సత్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాన్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఇంజనీర్ త్రినాథరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, చెన్నమల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 వేల ఆర్థిక సాయం

భీమవరం టౌన్, జూలై 17 : ప్రతిభావంతులు చదువుకునేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గణపవరం మండలానికి చెందిన ఆర్ఎల్ జయాదిత్యకి ఇంటర్ రెండో సంవత్సరం చదువుకునేందుకు అవసరమైన రూ.30 వేల పీఏను బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ బుధవారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేతుల మీదుగా అందజేశారు. దాత పేరిచర్ల సుభాష్‌ను మంత్రి శ్రీనివాసవర్మ అభినందించారు.

నేలకొరిగిన భారీ కొమ్మ

పెంటపాడు, : కొద్ది రోజులుగా ఈదురు గాలులతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల పరిషత్ ప్రాంగణంలోని భారీ వృక్షం కొమ్మ నేలకొరిగింది. ఈ ప్రాంతంలోనే మండలానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు ఉంటాయి. రాత్రి సమయంలో కొమ్మ విరిగి పడటంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం


వడలి గ్రామంలో పీర్ల గ్రామోత్సవం

నరసాపురం టౌన్/పాలకొల్లు అర్బన్/పెనుగొండ, జూలై 17: జిల్లాలో మొహరం పండుగను బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నరసాపురం పట్టణంలోని రైతుబజార్ వెనుక ఉన్న పీర్ల పంజా మందిరం నుంచి లాలాసాహెబ్‌ను పట్టణ వీధుల్లో ఊరేగించారు. రౌతులవారి కుటుంబం, ఆకు మహ్మత్ కుటుంబాలు ఏటా ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పీర్ల పంజా మందిరానికి లాలా సాహెబ్‌ను తీసుకొచ్చారు. ఆర్.కొండలరావు, ఆకీరోద్దిన్, ఆసోరావు, అమీర్, నజార్ తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లులోని ఆచ్యుతపురంలోని పంజాలో పీర్లను నూతనవస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. పెనుగొండ మండలం వడలి గ్రామంలో పిట్టలమేడవారి రోడ్డు పోతురాజు గుడి వద్ద నాగూర్ మీరా సాహెబ్ సంబరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గడచిన 56 సంవత్సరాలుగా మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం రాత్రి సమయం 9 గంటలకు నిప్పులగుండం కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 20న అన్నసమారాధనలో భక్తులు పాల్గొనాలని కోరారు.

పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేద్దాం

జనసేన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు పితాని, నాయకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్, చిత్రంలో ఎమ్మెల్యే పితాని

పోడూరు, జూలై 17 : కూటమి ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేద్దామని ఆచంట, నరసాపురం ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొమ్మిడి నాయకర్ అన్నారు. పోడూరులో జనసేన పార్టీ కార్యాలయాన్ని బుధవారం వారు ప్రారంభించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలుగు ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీల కార్యకర్తలు గుర్తించాలన్నారు. నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా జనసేన శ్రేణులు పార్టీకార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, పవన్ ఆశయాలను అనుసరించాలని సూచించారు. జనసేన మండల అధ్యక్షుడు రావి హరీష్‌బాబు, జనసేన గ్రామకమిటీ అధ్యక్షుడు బొక్కా గణపతి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురు భక్తికి ప్రతీక ఏకలవ్యుడు : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్/ఆచంట/ఉండి, జూలై 17 : ఏకాగ్రత, పనిపీద అంకితభావంతో పాటు గురుభక్తికి ఏకలవ్యుడు ప్రతీకగా నిలిచాడని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఏకలవ్యుడి జయంతి సందర్భంగా బుధవారం పాలకొల్లు కెనాల్ రోడ్డులోని ఏకలవ్యుడి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, నాయకులు పెచ్చెట్టి బాబు, కోడి విజయ భాస్కర్, గండేటి వెంకటేశ్వరరావు, పట్టణ ఏకలవ్య సంఘ నాయకులు కూరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఆచంట మండలం వల్లూరులో ఏకలవ్యుడి జయంతి సందర్భంగా విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ తాతం శ్రీనివాస్, ఎంపీటీసీ ఆరిమిల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాళ్ల మండలం కాళ్లలో ఎరుకల సేవా సంఘం గ్రామ కమిటీ కార్యదర్శి కుతాడి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, సోడదాసి గంగయ్య తదితరులు మాట్లాడారు.

మావుళ్ళమ్మ స్వర్ణవస్త్రానికి సహకారం అందించాలి

భీమవరంటౌన్, జూలై 17 : మావుళ్ళమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్రానికి అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం బొండాడ వారి విడిదిలో చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బొండాడ రామ్మోహన్‌రావు(రాముడు)ను బొండాడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మావుళ్ళమ్మ అమ్మవారికి 80 శాతం వరకు స్వర్ణ వస్త్రం పూర్తయిందని, మిగిలిన భాగాన్ని రెండేళ్లలోగా పూర్తి చేద్దామన్నారు. ఛాంబర్ అధ్యక్షుడు రాముడు మాట్లాడుతూ దాతలను సమీకరించి ఏడాదిన్నర లోపే అమ్మవారి స్వర్ణవస్త్రాన్ని పూర్తిచేస్తామన్నారు. అనంతరం బొండాడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొండాడ సుబ్బారావు, కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడారు. అసోసియేషన్ కోశాధికారి వినయ్, సభ్యులు బంగార్రాజు, మాణిక్యం గుప్తా, వెంకన్న గుప్తా, నాగభూషణం, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, విశ్వనాథం, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో నుంచి తరిమేశారని మహిళ ఫిర్యాదు

ఉండి జూలై 17: ఇంట్లోనుంచి తరిమేశారంటూ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. బుధవారం ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాలివి. యండగండి గ్రామానికి చెందిన దండే మరియమ్మ 20 ఏళ్ల నుంచి గల్ఫ్‌దేశంలో ఉంటూ ఇంటి వద్ద ఉన్న తండ్రి దిద్ది ముత్యాలకు డబ్బులు పంపించేది. తండ్రి ముత్యాలు, తమ్ముడు చినవెంకన్న ఇల్లు కడుతున్నానని ఫోన్‌లో చెప్పేవారని ఈ మధ్యనే గల్ఫ్ నుంచి ఇంటికి రాగా ఇంట్లో నుంచి తరిమేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.